ఆమ్‌చూర్.. రైతు బేజార్

- 30 వేల పంటను 20 వేలకే కొనుగోలు
- క్వింటాకు రైతులకు 10 వేల నష్టం
- ఆమ్‌చూర్‌కు నిజామాబాద్ మార్కెటే దిక్కు
- నాణ్యత పేరుతో నిలువు దోపిడీ
- అదేమీ లేదంటున్న మార్కెట్ అధికారులు

నిజామాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పసుపు పంట క్రయవిక్రయాలకు పేరుగాంచిన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్.. ఆమ్‌చూర్ (వరుగు పొడి) పంట అమ్మకాలకూ పెట్టింది పేరు. ఈ పంట క్రయవిక్రయాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకైక మార్కెట్ ఇదే. అనేక జిల్లాల నుంచి ఆమ్‌చూర్‌ను అమ్ముకునేందుకు మామిడి రైతులు వాహనాలను కిరాయికి తీసుకుని నిజామాబాద్‌కు వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఇక్కడ అందుబాటులో ఉన్న ధరలకు అమ్ముకోవడం తప్ప వేరే మార్గమే లేదు. తెచ్చిన పంటను అమ్ముకోకుండా వెనక్కి వెళ్తే కిరాయి డబ్బులు మీద పడుతాయని వ్యాపారులు కోట్ చేసే ధరలకే నోరెత్తకుండా అమ్ముకోవాల్సి వస్తున్నది. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు, దళారులు రైతులను నిండా ముంచుతున్నారు. నాణ్యతను సాకుగా చూపి వారు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తున్నారు. క్వింటా ఆమ్‌చూర్ పంటను 30 వేలకు కొనాల్సి ఉండగా.. 20 వేలకే కొంటూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. మామిడి రైతులకు కూలీల ఖర్చులు, కిరాయిలు, తోటల అద్దెల చెల్లింపులు కూడా మిగలడం లేదని వాపోతున్నారు. ఇందూర్ మార్కెట్‌లో ఇంత పెద్దఎత్తున దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోక పోగా.. దళారులు, వ్యాపారులకే కొమ్ముకాస్తున్నదని మామిడి రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా నిజామాబాద్ మార్కెట్‌లో ఆమ్‌చూర్‌కు సరైన ధర దక్కక రైతన్నలు బేజారవుతున్నారు.

నిజామాబాద్ మార్కెట్ యార్డులో విక్రయానికి తీసుకొచ్చిన ఆమ్‌చూర్

నాణ్యత పేరిట వ్యాపారుల పేచీ

ఆమ్‌చూర్ కొనుగోళ్లలో కొంత మంది వ్యాపారుల తీరు వివాదాస్పదమవుతున్నది. సుదూరాల నుంచి వచ్చే రైతుల అవసరాలను సొమ్ము చేసుకుంటూ తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాణ్యతను నిర్ధారించేందుకు మార్కెట్‌లో శాస్త్రీయమైన పద్ధతంటూ లేదు. రైతులు తెచ్చిన ఆమ్‌చూర్‌ను కేవలం పైపై దశలోనే చూసి ధరను నిర్ధారిస్తున్నారు. ఎండిన మామిడిని చేతితో ముట్టి చూడటం తప్ప ఇతరత్రా మార్గాలు లేవు. దీంతో ఏదో ఒకటి రంగు మారింది కనిపిస్తే ఇక రైతు పరిస్థితి అంతే సంగతి. క్వింటా ధర 30 వేలు పలుకాల్సిన పంట ఒక్కసారిగా 20 వేలకే పడిపోతుండటం నిత్యం కనిపిస్తున్నది. ఈ వ్యవహారాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ అలాంటిదేమీ లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారుల విక్రయాలపైనా నిఘా పెట్టాల్సి ఉండగా ఆన్‌లైన్ పేరిట ఈ-నామ్‌పైనే భారాన్ని మోపి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి.

ఆమ్‌చూర్‌తో నష్టాలే ఎక్కువ

ఏటా సీజన్‌లో మామిడి తోటలను గుత్తకు పట్టుకుని ఆమ్‌చూర్ తయారు చేస్తుంటం. కూలీల ఖర్చులు భారీగా పెరిగినయి. ఆమ్‌చూర్ ధర మాత్రం పెరగడం లేదు. కాయ కోసి, పొట్టు తీశాక ఆమ్‌చూర్ తయారీకి వంద కాయలకు 50 నుంచి 70 దాకా చెల్లింపులు చేస్తున్నం. తోట యజమానికి, కూలీలకు, రవాణాకు భారీ ఖర్చు అవుతుంది. మిగిలేది చెట్టుకు రూ.5 వేలలోపే ఉంటున్నది. ఆమ్‌చూర్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలె.

- శివరాం, మామిడి రైతు, రాఘవపురం, సిద్దిపేట

సిండికేట్ కాలేదు: ప్రభుత్వం

'గిట్టుబాటు ధర లేక ఆమ్‌చూర్ విలవిల' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రిలో బుధవారం ప్రచురితమైన కథనంపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖ స్పందించింది. ఈ అంశంపై నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యులను వివరాలు ఆరా తీశారు. శ్రద్ధానంద్ గంజ్ మార్కెట్‌లో 2014 నుంచి వ్యాపార లావాదేవీలు అన్నీ ఈ-నామ్ ద్వారానే జరుగుతున్నాయి. మే నెలలో మాత్రమే ఆమ్‌చూర్ మార్కెట్‌కు వస్తుంది. రైతులు తెచ్చిన ఆమ్‌చూర్‌ను కుప్పలుగా పోసి లాట్ నెంబర్లను పెడతాము. తద్వారా వ్యాపారులు కుప్పల వద్దకు వచ్చి సరుకు నాణ్యతను పరిశీలించి యూజర్ ఐడీని నోట్ చేసుకుని ధరలను రహస్యంగా ఆన్‌లైన్‌లో కోట్ చేస్తారు. ఈ పద్ధతి ద్వారా దళారులు, వ్యాపారులు సిండికేట్ అవ్వడానికి అవకాశమే లేదు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ప్రాంతాల నుంచి ఆమ్‌చూర్‌ను నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. మంచి నాణ్యత గల ఆమ్‌చూర్‌కు రూ.25 వేల నుంచి రూ.32,700 వరకు ధర పలుకుతున్నది. నాణ్యతలేని రంగు మారిన సరుకుకు రూ.8 వేల నుంచి రూ.25 వేలకు ధర పలుకుతున్నదని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకటేశం వివరించారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	43.4°c	27.1°c
మెదక్	41.5°c	24.7°c
మహబూబ్‌నగర్	40.9°c	29.5°c
నల్లగొండ	40.6°c	31.4°c
నిజామాబాద్	40.1°c	28.1°c
ఖమ్మం	40.0°c	29.0°c
రంగారెడ్డి	40.0°c	23.3°c
కరీంనగర్	39.0°c	28.0°c
వరంగల్	38.0°c	27.0°c
హైదరాబాద్	36.8°c	26.6°c

బంగాళాఖాతంలో మరో తుఫాన్!

- రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు
- వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): నైరుతి పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని అల్పపీడనం ఏర్పడినట్టు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారనున్నది. సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల వరకు ఆవర్తనం విస్తరించింది. గురువారం ఉదయం నుంచి మధ్య బంగాళాఖాతంలో గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నది. శుక్రవారం వరకు సముద్రం పరిస్థితి కూడా చాలా ఉధృతంగా ఉండే అవకాశం ఉందని నివేదికలు తెలిపాయి. శుక్ర, శనివారాల్లో బాలాసోర్, ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. శనివారం రాత్రి ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటుతుందని, తుఫానుగా మారి ఒడిశాతీరం దిశగా పయనించే అవకాశం కూడా ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

తొలకరికి ముందే రైతుభరోసా ఇవ్వాలి

- తడిసిన వడ్లను యుద్ధప్రాతిపదికన కొనాలి
- కొన్న వెంటనే సెంటర్ల నుంచి లిఫ్ట్ చేయాలి
- ఒక్కమంత్రి అయినా కల్లాల్లో కనబడుతున్నరా?
- బోనస్ ఇస్తామని మొండిచేయి చూపించారు
- జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలేవీ?
- పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే దుస్థితి వచ్చింది
- ఆగ్రోస్, పీఏసీఎస్ సెంటర్లలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- చిన్నకోడూరులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని వడ్ల కొనుకోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, మే 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): వానకాలం సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే, జూన్‌లోనే ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుభరోసా నిధులు విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకొడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తడిసిన వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో మంత్రులంతా కల్లాల్లో తిరిగారని, ఇప్పుడు ఒక్క మంత్రి అయినా కల్లాల్లో కనబడుతున్నారా? అని ప్రశ్నించారు. మంత్రులు హైదరాబాద్‌లో కూర్చుని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వడ్లు కొనకపోవడంతో అవి వర్షాలకు తడుస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వడ్లు కొంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని దుయ్యబట్టారు. చిన్నకోడూరులో తాము క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు రైతులు 20 నుంచి 25 రోజులుగా ఇక్కడే ఉన్నామని చెప్పారని తెలిపారు. తడిసిన ధాన్యం కొంటామని ప్రభుత్వం చెప్తున్నా, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్‌కు తీసుకెళ్తే తేమ శాతం ఉన్నదని, మొలకెత్తిందని చెప్పి ఒక సంచికి మూడు కిలోలు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని తరుగు తీసేయకుండా వడ్లు కొనాలని, తక్షణమే తడిసిన వడ్లు కూడా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇంకా 40% ధాన్యం కల్లాల్లో ఉన్నదని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన లారీల సంఖ్యను పెంచి త్వరితగతిన వడ్లు కొనాలని కోరారు.

ఎన్నికల ముందు ఒకమాట

ఎన్నికలకు ముందు వడ్లకు రూ.500, మక్కలకు, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా ఇవ్వకపోతే భవిష్యత్తులో రైతులు నిలదీస్తారని హెచ్చరించారు. సన్నవడ్లకు పెట్టుబడి ఎక్కువ, దిగుబడి తక్కువ, కాలపరిమితి ఎక్కువ కాబట్టి ఎవరూ పండించరని చెప్పారు. ఇంట్లో వాడుకునేందుకు మాత్రమే సన్నవడ్లను పండిస్తామని చాలామంది రైతులు చెప్తున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 3,38,389 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో దొడ్డు రకం 3,21,469 ఎకరాల్లో, సన్న రకం 16,920 ఎకరాల్లో మాత్రమే పండించారని వివరించారు. 95% దొడ్డు వడ్లు, 5 శాతమే సన్న వడ్లు పండిస్తారని.. అవి కూడా ఇంటి కోసమే అని చెప్పారు. రైతులు ఎంతో కష్టపడి వరి పండిస్తే వడ్లు కొనకుండా తాత్సారం చేయడంతోపాటు బోనస్ ఇవ్వకుండా మొండిచేయి చూపారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు దొరికే పరిస్థితి లేదని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని కావాలన్నా స్టాక్ ఉంచిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టినట్టు, ఇప్పుడు మళ్లీ పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు ఆగ్రోస్ సెంటర్లలో, పీఏసీఎస్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు

- 700 కోట్లు దండుకునేందుకే టెండర్ల పొడిగింపు
- సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్



కరీంనగర్ కార్పొరేషన్, మే 22: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 33 లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా టెండర్ పిలిచారని, ఇప్పటివరకు రెండు లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని మండిపడ్డారు. ఈ టెండర్ పొడిగింపు పేరుతో 700 కోట్లు దండుకోవాలని చూస్తున్నారని, టెండర్‌ను పొడిగించవద్దని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బుధవారం ఆయన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉన్నదని, దానిని ఎప్పుడు కొనుగోలు చేస్తారో? చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలుపై ఇప్పటివరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేక పోయారని దుయ్యబట్టారు.

తాళ్లరామడుగులో నేలకూలిన భారీ వృక్షం

భారీ వర్షానికి తడిసిన ధాన్యం

ఆదిలాబాద్ నెట్‌వర్క్/ఖలీల్‌వాడి, మే 22: ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం గాలిదుమారం హోరెత్తించింది. దీంతో పలుచోట్ల ధాన్యం తడిసింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అరగంటకుపైగా వాన దంచికొట్టగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలులకు సిరికొండ మండలం తాళ్లరామడుగులో భారీ వృక్షం నేలకొరిగింది. గాలిదుమారానికి బాన్సువాడలో నాలుగైదు గంటలపాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కాగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉట్నూర్‌లో వడ్ల కుప్పల మధ్య వర్షపు నీరు నిలవడంతో ధాన్యం తడిసింది. తలమడుగు మండలం ఉండం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్తు స్తంభం నేలకొరిగింది. తాంసిలో కొబ్బరి చెట్టు కూలడంతో ఓ ఇల్లు ధ్వంసమైంది. మార్కెట్ యార్డులో జొన్నలు తడవడంతో ఇబ్బందులు పడ్డారు. కుంటాల మండలంలోని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. నిర్మల్ పట్టణంలో ధాన్యంపై కవర్లను కప్పేందుకు రైతులు పరుగులు తీశారు.

రైతన్నకు విత్తనాల గోస

- జనుము విత్తనాల కోసం పడిగాపులు
- శంకర్‌పల్లిలో రోజంతా రైతుల బారులు
- 350 మందికి విత్తనాలు అందించాం
- మిగతా వారికి కూడా అందజేస్తాం: ఏవో

షాబాద్, మే 22: ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకునేందుకు విత్తనాల కోసం రైతులు గోస పడుతున్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి వ్యవసాయ కార్యాలయం ఎదుట జనుము విత్తనాల కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించారు. వానకాలం సీజన్‌కు జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్నారని తెలుసుకున్న రైతులు.. తమకు విత్తనాలు దొరుకుతాయో లేదోనన్న ఆందోళనతో పెద్ద ఎత్తున వ్యవసాయ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడున్న అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆందోళనకు దిగారు. అదునుకు విత్తనాలు ఇవ్వకుంటే ఎలా అని అధికారులను నిలదీశారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసీఆర్ సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించి అండగా నిలిచేవారని గుర్తుచేసుకున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి సురేశ్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. మండలానికి గత రెండు రోజుల క్రితం 40 క్వింటాళ్ల జనుము, 44 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, మళ్లీ బుధవారం రోజున 110 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయని తెలిపారు. మొత్తం 350 మంది రైతులకు జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేశామని, 60 క్వింటాళ్లు రావాల్సి ఉందని తెలిపారు.

హామీలు అమలు చేయకుంటే ఓట్లడగం

- సన్నవడ్ల ఉత్పత్తి పెంచేందుకే బోనస్
- వానకాలం నుంచి పంటల బీమా
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 22(నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని, ఒకవేళ అమలు చేయకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడగబోమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభించి చూపించామని ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంతో పోల్చితే కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం, ధాన్యం సేకరణ వెయ్యి రెట్లు నయంగా ఉన్నదంటూ రైతులు అభిప్రాయపడుతున్నారని చెప్పారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసినట్టు తెలిపారు. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని, గతంలో 45 రోజుల సమయం పట్టేదని పేర్కొన్నారు. వానకాలం రైతుల ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి పంట బీమా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. తడిచిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం సేకరిస్తున్నదని పేర్కొన్నారు. మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకే సన్నాలకు రూ.500 బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు.

1,440 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు సీజ్

నలుగురు నిందితులు అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, షాబాద్/చింతలమానేపల్లి మే 22 (ననమస్తే తెలంగాణ): నిషేధిత పత్తి విత్తనాలు సరఫరా చేస్తూ అమాయక రైతులను మోసగిస్తున్న నలుగురు వ్యక్తులను సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.36 లక్షల విలువైన 1,440 కిలోల నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన సురేశ్ యాదవ్ కర్ణాటకకు చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, రాష్ట్రంలోని అమాయక రైతులకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లాకు చెందిన పులికొండ యశ్వంత్‌కుమార్‌కు ఒక్కో ట్రిప్పుకు రూ. 40వేలు చెల్లించి కర్ణాటక నుంచి ఈ విత్తనాలను రాష్ట్రానికి తెప్పిస్తాడు. సురేశ్‌యాదవ్ సూచన మేరకు యశ్వంత్‌కుమార్ ఖాళీ వాహనంతో కర్ణాటకలోని సింధనూర్‌కు వెళ్లి, 1200 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు లోడ్ చేసుకుని నగరానికి బయలుదేరాడు. సమాచారం మేరకు ఎస్‌వోటీ, వ్యవసాయశాఖ అధికారులు కలిసి శంకర్‌పల్లిలోని జీనోమ్ వ్యాలీ ప్రాంతంలో వాహనంలో వస్తున్న యశ్వంత్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 1200 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకొన్నారు. మరో కేసులో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని ఎల్వర్తి బస్‌స్టాప్ వద్ద నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న బొర్ర శివకుమార్ (వెలమల గ్రామం), అశిరెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి (ఎల్వర్తి గ్రామం), మడమంచి ఉదయ్‌కుమార్ అలియాస్ కిరణ్ (ఫత్తేపురం గ్రామం)ను పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.6 లక్షల విలువైన 240 కిలోల నిషేధిత పత్తి విత్తనాలను సీజ్ చేశారు. కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గూడెం అంతరాష్ట్ర వంతెన వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. గంగాపూర్ గ్రామానికి చెందిన చాపిలే వినోద్, బొల్లబోయిన అశోక్, కృష్ణ, పురుషోత్తం రెండు మోటార్ సైకిళ్లపై 70 కిలోల గ్లైసిల్ పత్తి విత్తనాలను మహారాష్ట్రకు తరలిస్తూ పట్టుబడ్డారు. చాపిలే వినోద్ పట్టుబడగా.. అశోక్, కృష్ణ, పురుషోత్తం పరారయ్యారు. ఈ నకిలీ పత్తి విత్తనాల విలువ సుమారు 1.50 లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు.

నిందితుడు సహా స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తి విత్తనాలను చూపుతున్న పోలీసులు

రేపు రాష్ట్రవ్యాప్తంగా విత్తన మేళా

- విక్రయానికి 16 పంటల్లో 67 రకాలు
- పరిశోధన స్థానాలు, కేవీకేల్లో నిర్వహణ

హైదరాబాద్, మే 22(నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతుల కోసం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విత్తన మేళా నిర్వహించనున్నట్టు పరిశోధనా సంచాలకుడు డాక్టర్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్న ఈ మేళాను హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అదే రోజున విశ్వవిద్యాలయ పరిధిలోని జగిత్యాల, పాలెం, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో, అన్ని కృషి విజ్ఞాన కేంద్రాల్లో విత్తన మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ మేళాల్లో 16 పంటల్లో 67 రకాలకు చెందిన దాదాపు 12 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేళాలో వర్సిటీలో రూపొందించిన వివిధ వంగడాలను ఉంచుతామని తెలిపారు. వరిలో 27 రకాలు ఉన్నాయని, మెట్ట, అపరాలతో పాటు గడ్డి విత్తనాలనూ అందుబాటులో ఉంచనున్నట్టు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ కూల్చివేతలో మా ప్రమేయం లేదు

కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రొడ్డ బాపన్న

రామగిరి మే 22: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగేపల్లి ఎక్స్‌రోడ్‌లో సులభ్ టాయిలెట్ కాంప్లెక్స్ కూల్చివేతలో తమ పార్టీ ప్రమేయం లేదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రొడ్డ బాపన్న స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఈ విషయమై గ్రామ కాంగ్రెస్ నాయకులు తీగల సమ్మయ్య, ఎరుకల ఓదెలుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న కొన్ని కట్టడాలను ఆర్‌అండ్‌బీ అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ తొలగించారని తెలిపారు. అయితే.. ఆ నిర్మాణాలను కాంగ్రెస్ నాయకులు కూల్చివేయించినట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని బాపన్న స్పష్టం చేశారు.

సన్నాలపై స్పష్టత ఇవ్వని సర్కారు

ఏ రకం వడ్లకు బోనస్ ఇస్తుందో చెప్పని వైనం

ప్రభుత్వ రకాలు, ప్రైవేటు రకాలతో పాటు జిల్లాకో వెరైటీ

ఏ రకాలు సాగు చేయాలో తెలియక అయోమయంలో రైతులు

జాబితాలో లేని సన్నాలు సాగు చేస్తే బోనస్‌పై సందేహాలు

హైదరాబాద్, మే 22(నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్‌లో సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఇందుకు సంబంధించి కార్యాచరణ మాత్రం ప్రారంభించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏఏ రకాల సన్నాలను సాగు చేయాలో చెప్పకుండా సాగదీయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ నుంచి సన్నాలకు బోనస్ ఇస్తామని, సన్న రకాల జాబితాను వ్యవసాయశాఖ ఇస్తుందని మంత్రులు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ నుంచి ఎలాంటి జాబితా విడుదల కాలేదు. ఓవైపు రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తూ తుకాలు(నారు) పోసేందుకు సిద్ధమవుతుంటే.. ప్రభుత్వం ఏఏ సన్న రకాలను సాగు చేయాలనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఒకవేళ సన్నాల జాబితా లేకుండా రైతులు తమ ఇష్టమొచ్చిన రకాలను సాగు చేస్తే కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తీరా రైతులు సాగు చేశాక.. ప్రభుత్వం బోనస్ ఇవ్వకుంటే రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు సన్నాల జాబితా కోసం ఎదురు చూస్తున్నారు.

వందల రకాలు.. సమస్యలు

ధాన్యం విత్తనాల్లో ప్రస్తుతం మార్కెట్లో వందల రకాల సన్న రకాల విత్తనాలు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ యూనివర్సిటీ విడుదల చేసిన రకాలతో పాటు ప్రైవేటు కంపెనీలు విడుదల చేసిన రకాలు కూడా ఉన్నాయి. దీంతో పాటు ఒక్కో జిల్లాకు ఒక్కో వెరైటీ విత్తనాలను రైతులు సాగు చేస్తారు. చింటూ, గంగాకావేరి, హెచ్‌ఎంటీ, జైశ్రీరాం, సూపర్ అమన్, దస్తరి, పూజ, చిట్టిముత్యాలు, గోదావరి ఇసుకలు, మైసూర్ మల్లిగ వంటివి ప్రైవేటు కంపెనీల రకాలు. ఈ రకాలన్నీ మిర్యాలగూడ, సూర్యాపేట, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి జిల్లాల్లో సాగవుతాయి. ఇక బీపీటీ 5204, వరంగల్, జగిత్యాల, ఆర్‌ఎన్‌ఆర్ రకాలు వ్యవసాయ యూనివర్సిటీ అందించే రకాలు. ఈ నేపథ్యంలో ఇక్కడే సమస్య ఉత్పన్నమవుతున్నది. వ్యవసాయ శాఖ సన్న రకాల జాబితాలో ప్రభుత్వ వెరైటీలతో పాటు ప్రైవేటు రకాలను కూడా చేర్చుతుందా లేక కేవలం ప్రభుత్వ రకాలనే చేర్చుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ప్రైవేటు రకాలను జాబితాలో చేర్చితే ఆ తర్వాత పంటలో ఏమైనా ఇబ్బంది ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న వ్యవసాయ శాఖ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. అయితే రైతులు ఎక్కువగా బీపీటీ, హెచ్‌ఎంటీ, జైశ్రీరాం, గంగాకావేరీ, జగిత్యాల సన్నాలు, వరంగల్ సాంబ, వరంగల్ సన్నాలు వంటి రకాలను సాగు చేస్తారు. అయితే ఈ రకాలకు బహిరంగ మార్కెట్లోనే భారీ డిమాండ్ ఉంటుంది. మిల్లర్లు, వ్యాపారులే పొలాల వద్దకు వెళ్లి పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేస్తారు. మద్దతు ధరకు 500-700 వరకు అధిక ధర కల్పిస్తారు. సన్నాల జాబితా ఇస్తుందా లేదా ఒకవేళ ఇస్తే ఏ రకాలు ఉంటాయనేదానిపై ఆసక్తి ఉంది.



జాబితా లేకపోతే ఇబ్బందులే...

అన్ని రకాల సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే సమస్య లేదు. కానీ ఎంపిక చేసిన వాటికి మాత్రమే బోనస్ ఇస్తామంటే మాత్రం ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం కేబినెట్ పూర్తి తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... 'సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సన్న రకాల జాబితాను వ్యవసాయ శాఖ విడుదల చేస్తుంద'ని ప్రకటించారు. అంటే జాబితా రూపొందిస్తున్నారంటే పరిమిత రకాల సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తారేమో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని రకాల సన్నాలకు ఇవ్వాలనుకుంటే.. జాబితాతో పనేంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మంత్రి వ్యాఖ్యలతో రైతుల్లో అయోమయం నెలకొన్నది.

ముందస్తు ప్రణాళిక కరువు

సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది కానీ ఇందుకు సంబంధించి అటు ప్రభుత్వం నుంచి ఇటు వ్యవసాయ శాఖ నుంచి ప్రణాళిక కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సన్నాలను సాగు చేయాలంటూ రైతులకు పిలుపునిచ్చిన ప్రభుత్వం అందుకు అనుగుణంగానే రైతులకు సన్నాల సాగులో మెలకువలు, జాగ్రత్తలు, సాగు విధానాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఏ సన్న రకం ఎంత దిగుబడి వస్తుంది, పంట కాలం ఎంత ఉంటుంది, ఏ రకానికి ఎలాంటి చీడపీడలు పడతాయి వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలి. ఇంకెప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మాత్రం సన్నాల సాగుపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.